# క్లిక్ అండ్ చెక్

"ఏమిటయ్యా ఈ అరవ రిపోర్టరు పిల్ల గోల? ఇందాకట్నుంచి తెగ వాగుతోంది. ఈ అమ్మాయిని ఇక్కణ్నుంచి పొమ్మనేవాళ్లు లేరా?" అని విసుక్కున్నాడు ఇన్‌స్పెక్టర్ రాజమోహన్ కానిస్టేబుళ్ల మీద.

"అరవ పిల్ల కాదు సార్, పక్కా తెలుంగు పొణ్ణుదా. కంజీవరం. నేను చెప్తావున్నది మీరు కాదు, కాదు... కాదు, చెవిలో వేసుకోకుంటిరి. తొందరవు చేస్తున్నానని తలచకండి సార్. మా పత్రిక 'ఆంధ్ర ప్రజ' నన్ను రిపోర్టు రాయమని అన్పింది..." అని చెప్పబోయింది మలర్‌కొడి.

"మళ్లీ మొదలెట్టిందిరా నాయనా" అని నెత్తి కొట్టుకుని "ఏం దీపక్, మీ పత్రిక స్టాఫేగా. కొంచెం చెప్పరాదూ ఊరుకోమని. నా బుర్ర తినేస్తే కేసు ఎలా డీల్ చేయనయ్యా?" అన్నాడు రాజమోహన్ 'ఆంధ్రప్రజ' ఫోటోగ్రాఫర్ దీపక్ కేసి తిరిగి.

అతను చిరునవ్వు నవ్వి రాజమోహన్ వద్దకు వచ్చి కాస్త మెల్లగా "కొత్తగా చేరింది సార్. మెడ్రాసులో ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంలో ప్రత్యేకంగా ట్రెయినింగ్ అయి వచ్చింది. మా ఎండీ గారికీ మధ్య ఇదో పిచ్చి పట్టింది. కొత్తవాళ్లను, చిన్నవాళ్లను వేస్తే హుషారుగా పనిచేస్తారని. వచ్చిన దగ్గర్నుంచి నంజుకు తినేస్తోంది. మహాదూకుడు. ప్రపంచాన్ని పిండి కొట్టేస్తానంటుంది. ఈ హత్య కేసు తనే కవర్ చేస్తానంటూ అడిగి మరీ తీసుకుంది. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదు. చెబితే వినదు. మహా పొగరు..." అని చెప్పుకొచ్చాడు.

రాజమోహన్ విసుగ్గా తలవూపాడు. నిత్యవసంత కేసు పెద్ద తలకాయనొప్పి అయిపోయిందతనికి. నిత్యవసంత పెద్ద సెలబ్రిటీ ఫిగరు. పేరుమోసిన కాలమిస్టు. 'నిత్యయవ్వనంగా ఉండడం ఎలా?' అన్న విషయంపై వ్యాసాలు రాసి, ఉద్యమాలు నడిపి, సలహాలు ఇచ్చి మహిళా లోకాన్ని ఆకట్టుకుంది, ఆరాధ్యదైవం అయి కూచుంది. ఫిగర్ కాపాడుకోవడం గురించి ఆవిడ రాసిన పుస్తకాలు విశేషంగా అమ్ముడుపోయాయి. 'ఎంత తిన్నా, ఏం తిన్నా ఫర్వాలేదు. నేను రూపొందించిన ఎక్సర్‌సైజులు రోజు మూడు నిమిషాలు చేస్తే చాలు' అన్న నినాదంతో ఆమె పేరు ఇంటింటా మారుమ్రోగింది. ఎంతోమంది స్త్రీలు వారి, వారి వ్యక్తిగత సమస్యల గురించి కూడా ఆమెకు ఉత్తరాలు రాసేవారు. ఆమె అవివాహితే అయినా భర్తల గురించి, ప్రియుల గురించి కూడా చక్కటి సలహాలు ఇచ్చేది. ముప్పై ఐదు సంవత్సరాల వయసయినా అందంగా, నాజూగ్గా, నవ్వితే సొట్టలు పడే బుగ్గలతో ఉన్న ఆమె ఫోటో అశేష ప్రజానీకంలో ఉత్సాహం రగిల్చేది.

ఆమె కాలమ్ వలననే 'ఆంధ్ర జనత' పత్రిక సేల్సు బ్రహ్మాండంగా పెరుగుతూ వచ్చాయి. ఇప్పుడావిడ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడంతో ఆవిడ అభిమానులు, ఆరాధకులు విరుచుకుపడ్డారు. ఆంధ్రజనత హెడ్‌లైన్స్ గుప్పిస్తోంది – 'పోలీసులు ఏం చేస్తున్నారు? నిద్రపోతున్నారా?' అంటూ. ఆమె జీవితం రగిలించిన ఆసక్తి కంటే ఆమె మరణం ఇంకా ఆసక్తి రగిలించడానికి కారణం – ఆమె శవం కనబడిన తీరు. ఇంటి ఎదురుగానున్న పబ్లిక్ పార్కులో బెంచీ మీద కూర్చునుంది ఆమె. ఒంటి మీద బ్రా, అండర్‌వేర్, బూట్లు తప్ప వేరేమీ లేవు. ఆమె బట్టలన్నీ చుట్ట చుట్టి ఆమె పక్కన కనబడ్డాయి. ఆమె ఒంటరిగా నివసిస్తుంది. చుట్టాలు, పక్కాలు, స్నేహితులు ఎవరూ ఆమెతో ఉండరు. అయినా అంత రాత్రి, అంత చలిలో పబ్లిక్‌ప్లేస్‌లో అలాటి బట్టలు వేసుకుని ఆమె ఎందుకు కూచుంటుంది? నమ్మబుద్ధిగా లేదు. ఏదో మిస్టరీ ఉంది దీనిలో.

ఆ మిస్టరీ విడగొట్టాల్సిన బాధ్యత రాజమోహన్ కిచ్చింది డిపార్ట్‌మెంటు. 'కేసు ఎక్కడనుంచి నరుక్కురావాలో తెలియక తన్నుకుంటూంటే మధ్యలో ఈ పత్రికల వాళ్ళొకరు..' అనే చికాకు ఒకటి. అందులోనే ఈ మలర్‌కొడి లాటి వాళ్ళు తగిలితే శివమెత్తిపోవడం ఖాయం. ఆ అమ్మాయి మాట్లాడడం మొదలు పెడితే ఆగనే ఆగదు. రాజమోహన్ వింటున్నాడో, లేదో పట్టించుకోకుండానే ఆమె బోల్డన్ని విషయాలు చెప్పేసింది. – 'తనే వాళ్ల బాస్‌కి చెప్పి ఈ కేసు కవర్ చేస్తానందిట. ఆయన ఆడపిల్లవి కదా వద్దన్నాట్ట. నిత్యవసంత ఆడవాళ్ల ఐడాల్, అందువల్ల ఆడదృష్టితో చూసి, ఆడదృష్టితో రాస్తేనే పాఠకులు, ముఖ్యంగా పాఠకురాళ్లు థ్రిల్లయిపోతారుట. తనతో బాటు ఫోటోగ్రాఫర్ దీపక్‌ని తీసుకెళతానంటే ఎందుకన్నారుట. 'సడన్‌గా జరిగే సంఘటనలు ఫోటోలు తీస్తేనే విషయాలు బయటపడతాయి. దీపక్ తాగుబోతే కానీ మంచి ఫోటోగ్రాఫర్. పైగా నిత్యవసంత దగ్గర పనిచేసే అసిస్టెంటు లక్ష్మి దగ్గిర దీపక్‌కి చనువుంది. సమాచారం ఎక్కువగా తెలుస్తుంది' అని చెప్పిందట. వాళ్లు సరేనన్నారుట. తనెప్పుడూ హెల్ప్‌ఫుల్‌ట. ఉభయతారకమైన ఐడియా చెప్తోందిట. పోలీసులు అన్ని విషయాలు తనతో చెప్పి తనతో చేయి కలిపితే కేసు నిమిషాల్లో సాల్వ్ చేసేస్తుందట. కొన్ని విషయాలు ఆడవాళ్లే కనిపెట్టగలరట. ఉదాహరణకి ఫోటోలో నిత్యవసంత వేసుకున్న షూస్ బటన్ చేయకపోవడం చూస్తే అవి...'

"ఏ ఫోటో?" అని అడిగాడు రాజమోహన్.

"నా దగ్గర ఉన్న ఫోటో" అంది మలర్‌కొడి విలాసంగా, చేతిలో ఒక ఫోటో ఊపుతూ.

రాజమోహన్ అది లాక్కుని చూసాడు.

అది నిత్యవసంత శవం బెంచీ మీద ఉండగా ఓ పది, పన్నెండు అడుగుల దూరం నుంచి తీసిన ఫోటో. నీడలు బెంచీ వెనక పడుతున్నాయి. అందువల్ల ముందువన్నీ స్పష్టంగా కనబడుతున్నాయి. నిటారుగ్గా కూచున్న శరీరం, వాలిపోయిన చేతులు, వెనక్కి వాలిపోయిన తల, కండపట్టినా సన్నగానే ఉన్న కాళ్లు, స్ట్రాప్ తెరిచిపెట్టి ఉన్న షూస్ – అన్నీ స్పష్టంగా కనబడుతున్నాయి.

"ఇది ఎవరు తీశారు? నీ కెక్కడ దొరికింది?" అంటూ అరిచాడు రాజమోహన్.

దీపక్ గొంతు సవరించుకున్నాడు. "నేనే తీసాను. ఇవాళ పొద్దున్న మీ వాళ్లంతా వచ్చే ముందే నేనిక్కడికి చేరాను. లైటింగు బాగానే ఉంది. పార్కు ఫెన్సింగు ఎక్కి ఓ ఫోటో లాగించేశాను..." రాజమోహన్ ఎర్రగా చూడడం చూసి తొట్రుపడ్డాడు. "..అసలెవరికీ చూపిద్దామనుకోలేదు. పేపర్లో వేద్దామనుకోలేదు. ఇదిగో ఈ పిల్లే నేను స్టూడియోలో లేకుండా చూసి కొట్టేసింది."

"రాసమోగన్ సార్, ఎవ్విరిథింగ్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ జర్నలిజమ్. వసందమ్మ వేలక్కారి లక్ష్మి నడిగి కొంత సమాచారం పట్టివేస్తిని. ఈ సారు ఆపె ఫ్రెండు గదా అని ఈయన వీట్టికి పోయి సూస్తిని. ఫోటో చిక్కింది. ఆ షూస్ చూస్తిరా? ఆ హీల్ చూస్తిరా? అంత హీల్‌తో స్ట్రాప్ వేయకుండా నడిచేది ముదుస్తుందా? చెప్పుండి..." అందుకుంది మలర్‌కొడి.

రాజమోహన్ కళ్లెగరేసి, "చూడండి మిస్..."

"...మలర్‌కొడి" అందించిందామె.

"కోడి ఏమిటి? కోడీ, పెట్టా?" నుదురు చిట్లించాడు.

"కొడి సార్... క్రీపర్..."

"...ఇది బాగుంది. గొప్పపేరే... యు ఆర్ గివింగ్ మీ క్రీప్స్. మీరు ఫాక్ట్స్ అన్నీ సేకరించి దగ్గర పెట్టుకోండి. ఆ తర్వాత పోలీసులకు పాఠాలు చెబుదురు గాని. పార్క్ గేటు వసంత ఇంటికి ఇంచుమించు ఎదురుగా ఉంది. రాత్రి పదిగంటల ప్రాంతంలో లక్ష్మికి చెప్పి బయటకు వెళ్లింది వసంత. అది కొత్త పద్ధతి కాదు. తరచుగా ఆవిడా ప్రాంతంలో బయటకు వెళ్లి రెండు, మూడు గంటలు బయట తిరిగి వస్తూ ఉంటుందని లక్ష్మి చెప్పింది. బహుశా ఆ పార్క్‌లో కూచుంటుందని ఆ అమ్మాయి ఉద్దేశ్యం. అవాళ బీటు మీద తిరుగుతున్న పోలీసు పార్కు గేటు దగ్గర చప్పుడయితే తన బాటరీ లైటు వేసి

చూసాడు. వసంత కనబడింది. ఎవరని అడిగితే ఎదురు ఇంట్లో ఉంటానని, కాలనీ పార్కులో కూచోడం తన కలవాటని చెప్పింది వసంత. సరేనని వెళ్ళనిచ్చాడు. కానీ అతనికి ఏదోలా అనిపించింది. ఒక గంట తర్వాత మళ్లీ బీటులో అటువైపు వచ్చినప్పుడు పార్కులోకి వెళ్లాడు.

లైటు వేసి చూస్తే అక్కడ వసంత కూచుని కనబడింది. కానీ ఈసారి అక్కడున్నది ఆమె శవం. పక్కన ఒక చేతికర్ర పడివుంది. దానితోనే ఆమె బుర్ర పగలగొట్టారెవరో. కపాలం పగిలి కణతల నుంచి రక్తం కారినట్టు తెలుస్తోంది. ఆమె హేండ్‌బాగ్ అక్కడే పడి ఉంది. అయినా దాని మీద వేలు వేయలేదెవరూ. అంటే డబ్బు కోసం దొంగతనం కాదన్నమాట. నేల గట్టిగానే ఉన్నా ఆమె హైహీల్స్ మార్కులు అక్కడ చాలా పడ్డాయి. ఎవరితోనో ఆమె అక్కడ పోట్లాడింది. ఓకే, ఇదీ ఇప్పటిదాకా తెలిసినది. దీన్ని బట్టి చూస్తే ఆమె హీల్స్ వేసుకుని నడిచి లోపలికి వచ్చింది, పోట్లాడగలిగింది. ఒక స్ట్రాప్ తెరిచివుంటే ఏమిటి? మూస్తే ఏమిటి? మీ స్ట్రాప్ థీరీ.."

"సార్, మీరు ఏమి చెప్పినా కట్టాయం వింటును సార్. కానీ ఆండవాళ్ల మాట కూడా వినండి సార్. ఆ మాదిరి హీల్స్‌తో... నడవ మాళదు సార్, మీరు వసందమ్మ లవర్ మదన్‌తో మాట్లాడి చూస్తిరా, ఆయన చెప్పి వుండాలే ఆపె ఎక్కడికి పోయింది లేదని.."

"చూడు మల్లు కోడీ.."

"మలర్ కొడి"

"సర్లే సర్లే, మలర్... ఏం పేరురా నాయనా? కేసు విచారణ ఎలా చేయాలో పోలీసువాళ్లకి లెక్చరివ్వడానికి చూడక. మదన్‌ని థరోగా అడిగి చూసాం. అతను ఆమెతో కలిసి ఉండడు. అందువల్ల ఎప్పుడు ఏం చేస్తుందో అతనికి తెలియదు. అతనికి వసంత అంటే పెద్ద గౌరవం లేనట్టుగా ఉంది. ఆ మూడు నిమిషాల ఎక్సర్‌సైజుల సంగతేమో కానీ వసంత మాత్రం బ్రహ్మాండంగా అడ్డపడి తినేస్తుందట. పెళ్లి గురించి అందరికీ సలహాలిస్తుంది కానీ తను మాత్రం చేసుకోవటం లేదట. 'అసలిదివరకే పెళ్లయిపోయిందేమో, తన పబ్లిక్ ఇమేజి చెడిపోతుందని డైవోర్సు తీసుకోలేకపోయిందేమో, అందుకే నన్ను తిప్పుతోందేమో' అని అనుమానం వెలిబుచ్చాడతను. మహా అనుమానం మనిషి. కర్రపెట్టి అంత చావుదెబ్బ కొడితే రక్తం అంత తక్కువే ఎలా కారింది? ఇందులో ఏదో మిస్టరీ ఉందంటాడు..."

"...ఉండాదా?"

"వాడి తలకాయ. నేను ఇలాటి కేసులు రెండు, మూడు చూసాను. బ్రెయిన్ టిస్యూలు ఎన్ని డామేజి అయ్యాయన్నదాని మీద ఆధారపడి ఉంటుంది. ఓ సారి మా ఫ్రెండుకి రైల్వే కంపార్టుమెంటు తలుపు తగిలింది. దెబ్బ ఎక్కడి తగిలిందో కానీ ఏమీ జరగలేదనుకున్నాడు. ఇంటికి నడుచుకుంటూ వచ్చేసాడు. కానీ కాస్సేపటికి చూస్తే ఇంటర్నల్ హెమరేజ్ వల్లనో ఏమో కుప్పకూలిపోయాడు. నిమిషాల్లో ప్రాణాలు పోయాయి. అప్పుడనుకున్నాం దెబ్బ నిజంగానే గట్టిగా తగిలిందిరా అని. కానీ అప్పటికే టూ లేట్... అదే చెప్పాను..."

"మీరు నిండా మోసమాన ఆళు. చెప్పినట్టే చెప్పి అంతా అరగొరగా చెప్తారు. బట్టల్లో కనబడ్డ విగ్గు, నల్ల కళ్లద్దాల మాట ఏమన్నాడాయన?"

రాజమోహన్ బిర్రబిగుసుకుపోయాడు. "నీకు ఇవన్నీ ఎలా తెలుస్తున్నాయి?"

"చెప్తిని కదా సార్, లచ్మీఅమ్మాళ్‌దా చెప్పి పూడ్చింది. అదు సరి, మదన్ సారు.."

"మదనా? నేను అతన్ని అడుగుతూనే ఉన్నాను. ఈ లోపున ఎవరో పిలిచారు. వెళ్లాను. వచ్చేసరికి నిద్రమాత్రలు మింగేసాడు. వసంత చచ్చిపోయిన దుఃఖంట. ఆ లక్ష్మి నన్ను తప్పు పడుతోంది. నేను దగ్గరుండి కాపాడి ఉండాల్సిందిట. పోలీసంటే అందరికీ లోకువగానే ఉంది."

మలర్‌కొడి రాజమోహన్ దగ్గరగా వచ్చి చెవిలో గుసగుసలాడింది. "సార్, ఈ దీబక్ లచ్మి వెంట తిరుగుతాడు కానీ అది చూస్తే మదన్ అంటే పడి చస్తావుంది. స్లీపింగ్ పిల్స్ అంతా డ్రామా సార్. దుడ్డు కోసం వాళ్లు రెండు పేర్ కలిసి వసంతమ్మను..."

అంత విసుగులోనూ రాజమోహన్‌కి నవ్వు వచ్చేసింది. "ఇదిగో కోడిపిల్లా, నీ ఐడియాలు వింటూంటే నాకే మతిపోయేట్టుంది. ఇక వదిలిపెట్టు." అంటూ ముందుకు సాగిపోయేడు.

కానీ రెండు రోజుల తర్వాత అతనే మలర్‌కొడి గురించి వెతకవలసి వచ్చింది. కాలనీలో ఆమె కనబడగానే "నిన్న పేపర్లో ఆ రిపోర్టేమిటి అలా వేసారు? మూడు సార్లు నన్ను అందగాడని వర్ణించావు. మా డిపార్టుమెంటులో అంతా నన్ను ఆటపట్టిస్తున్నారు తెలుసా?" అన్నాడు.

ఆమె తొణకలేదు. "ఏమి సంగతి నేను మూతి మీదనే చెప్పేస్తాను. నేను రిపోర్టు ఇంగ్లీషులో హేండ్‌సమ్ అని రాసి ఇస్తిని. దాన్ని అందగాడు అని ట్రాన్స్‌లేట్ చేసినాడు. సరిదానే?"

"అది రాయవలసిన అవసరం ఏముందని? నేను అంత ఇన్‌ఫర్మేషన్ ఇచ్చింది నీ మొహం నాకు నచ్చింది కాబట్టి..." చెప్పబోయాడు రాజమోహన్.

రాజమోహన్ కాంప్లిమెంటుకి మలర్‌కొడ్డి ఉబ్బి తబ్బిబ్బవలేదు. "అంటే నా బ్రెయిన్ పట్టలేదా? చూడుమీ, ఆ షూస్ గురించి ఇంకా చెప్పేదా? వసందమ్మ పార్కులోకి వచ్చే తన బట్టలు సొయమా తానే ఉడిసింది అంటావు. తప్పు. షూస్ మాత్రం వేసుకుని కూచుంటుందా? వాటితో నడిసేదే మహా కష్టం. ఇక ఫైట్ చేసేది వేరేయా? ఇంపాసిబుల్ నిచ్చయంగా ఆమె సచ్చిపోయిన తర్వాతనే షూస్ తొడిగి ఉండారు."

"ఎవరు? హంతకుడా? వాడికేం పట్టింది?"

"సీక్వెన్స్ చెప్తాను విను. ఆ యమ్మ ముందు పార్కుకదా పోయింది. తర్వాత అక్కడనుంచి వేరే ఏడానికి పోయింది. ఏదో ఇన్‌డోర్స్ అక్కడ తానే బట్టలు విప్పుకుంది. అక్కడ ఎవరో ఆమెను చంపిపూడ్చినారు. ఎగైన్ పార్కుకు తీసుకువచ్చి ఉడిచినారు. ఇక్కడనే చచ్చిపోయింది అని చెప్పేదానికి ఉడుపులు తొడిగేది ఆరంభించినారు. కానీ మధ్యలో ఏమో వచ్చింది. వదిలి పోయిడిసారు..."

"కథ బాగుంది. వేరేవాళ్ల ఇంటికి వెళ్లి వసంత బట్టలు విప్పుకుని కూచుందా? ఇంపాజిబుల్." అని అంటూండగానే రాజమోహన్ కంట 'ది వీనస్ స్టీమ్ బాత్ పార్లర్' కనబడింది. వెంటనే ఆగిపోయాడు. అతని వెంటనున్న మలర్‌కొడి ఆగిపోయింది.

కొద్ది నిమిషాల్లో వాళ్లిద్దరూ లోపలికి వెళి రిసెప్షనిస్టును కలవడం, నిత్య వసంత ఫోటో చూపి అడగడం జరిగింది. ఆమె పెదవి విరిచింది కానీ రాజమోహన్ వెంటనే ఆ ఫోటోను చేతిలోకి తీసుకుని వసంత బట్టల్లో దొరికిన విగ్గు, నల్ల కళ్లద్దాలు ఫోటో మీద దిద్ది మళ్లీ చూపాడు. "ఈమె తెలుసు సార్. తరచుగా రాత్రి వచ్చి స్టీమ్‌బాత్ తీసుకుంటారు. ఎవరితో మాట్లాడరు. మూడురోజుల క్రితం కూడా వచ్చారు. తిరిగి వెళ్లడం మాత్రం చూడలేదనుకోండి." అందామె. "ఆమె నిత్య వసంత. స్లిమ్ కావడం గురించి అందరికీ లెక్చర్లిస్తుంది కానీ, తను మాత్రం శుబ్బరంగా తినేసి రాత్రిళ్లు మారువేషంలో వచ్చి స్టీముబాత్‌లు, మడ్‌బాత్‌లు తీసుకుని గ్లామరు కాపాడుకుంటుంది. అందుకే ఎవరితోనూ మాట్లాడకపోవడం." అన్నాడు రాజమోహన్ కసిగా.

"నిత్యవసంత గారా? నేను ఆయన ఫాన్‌నండి. ఆవిడ నేర్పే ఎక్సర్‌సైజులు చేసి..."

"వేస్టు. ఇవాళిటి నుండే ఆపేయి. తెలిసొచ్చిందిగా. అంతా హంబగ్. వెళ్లి మీ ఓనర్ని పిల్చుకురా." అన్నాడు రాజమోహన్ దర్పం ఉట్టిపడుతూండగా.

ఓనరు దేవకి. రావడమే భయపడుతూ వచ్చింది. అందునా రాజమోహన్ జైలు, హత్య అనగానే వణికింది. "ఇదంతా నా కర్మానికి వచ్చింది. లేకపోతే వసంత ఈసారి వచ్చినప్పుడు జారి స్టీమురూములో పడడం ఏమిటి, కణతల మీద దెబ్బ తగిలి ప్రాణం పోవడమేమిటి..."

"ప్రాణం పోయిందని తెలియగానే మీరేం చేసారు?" అడిగేడు రాజమోహన్.

"ఏం చేస్తాను. భయపడి చచ్చాను. ఇది బయటపడితే మా పార్లర్‌కి అప్రదిష్ట. అసలు రావడమే వసంత అదోలా నడుస్తూ, గాలిలో తేలిపోతూ వచ్చింది. వచ్చిన పావుగంటకే చచ్చిపోయింది. గత్యంతరం లేక శవాన్ని మోసుకెళ్లి పార్కులో కూర్చోపెట్టేను. బట్టలు తొడుగుదామని బ్రా, డ్రాయరు

తొడిగేను. చెప్పులు తొడుగుతూండగా ఇంతలో కళ్లు మిరుమిట్లు గొలిపేట్లా గస్తీ పోలీసు టార్చ్‌లైటు వేసాడు. భయపడి బెంచీ వెనక్కాల దాక్కుని పారిపోయి వచ్చాను.” అంది దేవకి.

“మొన్న ఆ మాదిరి చెప్పింది కానీ ఇప్పుడు చూడుమీ. దేవకి, లచ్మి, మదన్ అంతా ఒకే తావులో గుమిగూడినారు. తోడు దొంగలు. రాసమోగన్ సారు నల్లవరు, వీళ్లంతా ఇక్కడ వస్తురని మనకు పాపం చెప్పిడిచినాడు.” అంది శుక్రవారం రాత్రి వసంత ఇంటిబయట కాపు వేసిన మలర్‌కొడి దీపక్‌తో.

దీపక్ జేబులోంచి బాటిల్ తెరిచి తాగుతూ జవాబు చెప్పేలోపున అతని భుజం మీద చెయ్యి పడింది. తిరిగి చూస్తే రాజమోహన్. “దీపక్, నువ్వు తీసిన ఫోటో గురించి కాస్త మాట్లాడాలి. వస్తావా?” అన్నాడు. “కొంజెం నిలవండి సారు...” అంటూ మలర్‌కొడి ఏదో చెప్పబోతూండగానే ఆమె నాపి “ఈ ఫోటో మంగళవారం నాడు పొద్దున్న తీసానన్నావు కదూ. దీనిలో కనబడే అన్ని నీడలు బెంచీ వెనకాల పడుతున్నాయి. కానీ పార్కులో చూడబోతే బెంచీ పడమటివైపుకి ఫేస్ చేస్తోంది. మరి దాని మీద ఎండ ఎలా పడిందంటావ్? సూర్యుడు ఆ రోజు పడమట ఉదయించాడా?” అడిగాడు వెక్కిరింతగా.

దీపక్ నీళ్లు నములుతుండగానే, “అంటే అది రాత్రి తీసావు. ఎందుకు? దేవకిని బ్లాక్‌మెయిల్ చేయడానికి. కానీ దానిలో దురదృష్టవశాత్తూ ఆమె ఫోటో రాలేదు. ఇక పనికిరాదులే అని మూలపడేస్తే, ఇదిగో ఈ ఓవర్‌స్మార్ట్ కోడిపిల్ల అది నీ లాబ్ లోంచి కొట్టేసింది. దాంతో అది పొద్దున్న తీసినదని దబాయిస్తున్నావు.” అన్నాడు రాజమోహన్.

“నిండా బుద్ధిశాలితనంగా మాట్లాడుతున్నారే. ఫోటో ఎత్తేదానికి ఆ టైములో దేవకి పార్కుకి వస్తుందని దీబక్‌కి ఏర్కణవే తెలుసునా?” అంది మలర్‌కొడి ఆవేశంగా.

“ఇదిగో మిస్. నువ్వు కాస్త ఆగు. మీ జర్నలిస్టులకంటే మా పోలీసు నెట్‌వర్కు పెద్దది. నిత్యవసంతకు అంతకు ముందే పెళ్లయి ఉండవచ్చని ఎప్పుడైతే మదన్ అనుమానం వెలిబుచ్చాడో అప్పుడే నాకు ఐడియా వచ్చింది. రాష్ట్రమంతటా మారేజి రికార్డులు వెతికించాను. పదిహేనేళ్ల క్రితం ఇంట్లోంచి పారిపోయి వచ్చిన వసంత ఈ దీపక్‌ని పెళ్లి చేసుకుంది, రిజిస్ట్రార్ ఆఫీసులో. తర్వాత ఇద్దరూ గొడవపడ్డట్టున్నారు. ఈ తాగుబోతు ఇలా మిగిలేడు. ఆమె సెలబ్రిటీ అయిపోయింది. డైవోర్స్ తీసుకుంటే తన ఇమేజ్‌కి భంగం అని ఆమె దడిసింది. అది అలుసుగా తీసుకుని ఇతను బ్లాక్‌మెయిల్ చేసేవాడు. వసంత ఇంటి చుట్టూ తిరిగేందుకు సాకు కోసమే లక్ష్మితో ప్రేమించినట్టు కనబడేవాడు.

క్రమంగా దీపక్ డిమాండ్లు పెరగడంతో వసంత ఆ రోజు రాత్రి పార్కుకి దీపక్‌ని రమ్మనమని ఉంటుంది. అక్కడ ఇద్దరికీ గొడవ అయివుంటుంది. ఆవేశంలో దీపక్ ఆమెను కర్రతో మొత్తేడు. ఆమె పడిపోవడంతో భయపడి పారిపోయాడు. కానీ నేను చెప్పిన రైలు డోర్ తగిలిన ఫ్రెండులాగే వసంత కూడా తల దిమ్మెత్తిన కండిషన్‌లో అక్కణ్నుంచి స్టీమ్‌బాత్ పార్లర్‌కి వెళ్లింది. అక్కడ బట్టలు అన్నీ విప్పుకున్నాక హెమరేజ్ వచ్చి కుప్పకూలి మరణించింది. తన పార్లర్‌కి అప్రతిష్ట వస్తుందని భయపడిన దేవకి కాకతాళీయంగా వసంత శరీరాన్ని అదే పార్కులో అదే బెంచీకి చేర్చింది. బట్టలు తొడగనారంభించింది. ఈ లోపున దీపక్ ఇంటికి వెళ్లిన తర్వాత ఆలోచించాడు. శవం మాయం చేద్దామని వచ్చిన అతనికి దేవకి కనబడింది. ఫోటోగ్రాఫర్ కదా, కెమెరా రెడీగా ఉంటుంది. ఛట్టున ఫోటో లాగేసాడు..”

“ఇదంతా మీరు కణ్ణారా చూసినట్టు చెప్తున్నారే?” అంది మలర్‌కొడి.

“దేవకి అన్నదేమిటి? కళ్లు మిరిమిట్లు గొలిపే కాంతి వచ్చిందని. గస్తీ పోలీసు బాటరీలైటుకి అంత కాంతి ఉండదుగా. అది ఫ్లాష్ కావచ్చు. అప్పుడే నాకు అనుమానం వచ్చి దీపక్ ఫోటో పరీక్షించాను. నీడల వల్ల ఫోటో తీసిన టైము తెలిసివచ్చింది. ఈలోగా వాళ్ల పెళ్లి సమాచారం కూడా వచ్చి చేరింది.

ఇంకేముంది? కానీ దీపక్ పారిపోవచ్చునని డౌటు వచ్చింది. అందుకే అనుమానితుల నందరినీ ఇక్కడ చేరమని చెప్పి నీకు కబురు పెట్టాను. దీపక్‌ని తప్పకుండా లాక్కువస్తావని తెలుసు కాబట్టి. రెండు గంటలుగా మీరిక్కడే వెయిట్ చేస్తూండగా ఈ లోపున దీపక్ స్టూడియో సోదా చేసాను. తక్కిన వాళ్లను కూడా బ్లాక్‌మెయిల్ చేసిన దాఖలాలు కనబడ్డాయి. కథంతా అర్థమయ్యింది." అని అతను అంటూండగానే పోలీసులు దీపక్ చేతులకు బేడీలు తొడగడం అయిపోయింది.

"మీరు నిండా బుద్ధిశాలిదా. మీరు, నేను కలిసి పనిచేస్తే ఇదే కాదు, అన్నిటిలోను సక్సెస్‌దా." అంది మలర్‌కొడి రాజమోహన్‌కి చేరువవుతూ.

"ఈ వాయాడి పొణ్ణుతో కల్యాణమా? ఆమ్మో..." అంటూనే ఆమెను దగ్గరికి లాక్కుని బుగ్గ ముద్దాడబోయాడు.

"మీకు తమిళ్ వచ్చునా" అందామె ఆశ్చర్యంతో అతన్ని తోసేస్తూ.

"కొంజెం...కొంజెం.." అంటూనే ఆమె బుగ్గను సుతారంగా కొరికాడు.